క్లుప్తంగా

స్వచ్ఛతపై అవగాహన పెరగాలి

సామర్లకోట: స్వచ్ఛతపై స్థానిక రైల్వే స్టేషన్‌లో చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించారు. స్వచ్ఛ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా పిల్లలకు చిన్నతనం నుంచి స్వచ్ఛతపై అవగాహన పెంచుతున్నట్టు రైల్వే చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి అన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు, చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ మేరకు విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, రైల్వే సూపరింటెండెంట్ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న పారిశుధ్య సిబ్బందికి బహుమతులు అందజేశారు.

దైవ జనులకు సత్కారం ప్రతి ఒక్కరి బాధ్యత


ప్రముఖ దైవ జనులు సత్యానందాన్ని సత్కరిస్తున్న సభ్యులు

పెద్దాపురం: ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని దేవుని సేవలో తరిస్తున్న దైవ జనులను సత్కరించాల్సిన బాధ్యత సంఘ విశ్వాసులకు ఉందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం పాస్టర్స్ డే సందర్భంగా క్రీస్తు శాంతి ప్రార్థన మందిరాల వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం, సీజీఎం వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్‌ను మండలంలోని తిరుపతి, దివిలి, చదలాడ, కాండ్రకోటతో పాటు, దివిలి శివారు పిఠాపురం మండలం విరవ ప్రార్థనా మందిరాల్లో సంఘ విశ్వాసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దైవజనులు సత్యానందం, సుదీప్ మాట్లాడుతూ, దేవుని కృప ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. అనంతరం ఆయా సంఘాల చర్చిల్లో వారిని సత్కరించారు.

వచ్చే నెల రెండు నుంచి కార్తిక ఉత్సవాలు


ముహూర్తపు రాటకు పూజలు చేస్తున్న ఈఓ

సామర్లకోట: కార్తిక మాసం సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల రెండు నుంచి డిసెంబర్ ఒకటి వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి ఆదివారం కాలభైరవ స్వామి ఆలయం వద్ద ముహూర్తపు రాట వేశారు. ఈఓ విలేకర్లతో మాట్లాడుతూ, నవంబర్ ఒకటిన రాత్రి ఆలయంలోని ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపం వెలిగించి కార్తిక మాస ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. నవంబర్ 15న కార్తిక పౌర్ణమి సందర్భంగా గ్రామోత్సవం, జ్వాలా తోరణం ఉంటుందన్నారు. 19న స్వామివారి జన్మనక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా తెప్పోత్సవం ఉంటుందని తెలిపారు. 28న మాసశివ రాత్రికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, డిసెంబర్ ఒకటిన అమావాస్య సందర్భంగా కోటి దీపోత్సవం ఉంటాయన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా రెండో తేదీం సాయంత్రం స్వామివారిని జటాఝూటంతో అలంకరిస్తామన్నారు.

8 మంది జూదరుల అరెస్టు

సామర్లకోట: పిఠాపురం రోడ్డులో ఉన్న ప్రైవేటు డాబాపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.13 వేలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎ కృష్ణభగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీ అన్న సమారాధన

కొత్తపల్లి: గాజులదొడ్డిలో ఉన్న బాలదుర్గా ఆలయం వద్ద శరన్నవరాత్రుల ముగింపులో భాగంగా ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కొత్తపల్లి గ్రామం నుంచే కాకుండా, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, ఉప్పాడ తదితర గ్రామాల నుంచి సుమారు 2 వేల మంది భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో కనకదుర్గ నిమజ్జన ఊరేగింపు

సామర్లకోట: మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో శనివారం కనకదుర్గ గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలోని అమ్మవారి విగ్రహాన్ని గ్రామ నాయకుడు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో ఊరేగింపుగా గోదావరి కాలువ రేవు వద్దకు తెచ్చి నిమజ్జనం చేశారు. అదేవిధంగా ఆదివారం 31వ వార్డులోని అమ్మవారిని, రైల్వే స్టేషన్‌ు ఆవరణ రైల్వే కార్టర్సులోను, బళ్ల మార్కెట్, గాంధీచౌక్‌ల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అన్నదానామృతం

- పంచారామ క్షేత్రంలో అన్నదాన పథకానికి మూడేళ్లు
- దేవస్థానంలో భక్తుల విరాళాలతో నిర్వహణ
- బోర్డులపై నోచుకోని దాతల పేర్లు
- రోజురోజుకూ పెరుగుతున్న భక్తులు


పంచారామ క్షేత్రంలో అన్నదానంలో భోజనాలు చేయడానికి బారులు తీరిన భక్తులు

సామర్లకోట: అన్నం పరబ్రహ్మ సర్వరూపం అంటారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మహా పుణ్యకార్యం. మూడేళ్ల క్రితం స్థానిక పంచారామ క్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో ప్రారంభించిన అన్నదాన పథకం నిరాటంకంగా కొనసాగుతోంది. అంతకుముందు భక్త సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహణ సాగేది. దేవదాయ శాఖ ఉన్నతాధికారులు అన్నదానాన్ని దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కోవిడ్ తరువాత 2021 అక్టోబర్‌లో దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడమనేది మన సంప్రదాయంగా వస్తోంది. ఈ మేరకు భక్తులు ఆలయాల్లో జరుగుతున్న అన్నదానాలకు విరాళాలు ఇవ్వడం ప్రారంభించారు. ఈ విరాళాలు సేకరించి, ఆ మొత్తాలను బ్యాంకులో డిపాజిట్లు చేసి, వచ్చిన వడ్డీతో అన్నదానం నిర్వహిస్తున్నారు. అన్నదానానికి రూ.10 లక్షలకు మించి విరాళాలిచ్చే వారిని వ్యవస్థాపక నిత్యాన్నదాతగాను, రూ.ఐదు లక్షలకు పైన ఇచ్చే వారిని మహారాజ పోషకులుగాను, రూ.రెండు లక్షలకు పైన ఇచ్చే వారిని రాజపోషకులుగాను, రూ.లక్ష పైన ఇచ్చే వారిని విశేష పోషకులుగాను, రూ.50 వేలు పైన ఇచ్చే వారిని పోషకులుగాను, రూ.25 వేలు ఇచ్చే దాతలను విశేష దాతలుగాను, రూ.10 వేలు పైన ఇచ్చే వారిని దాతలుగాను గుర్తిస్తారు. రూ.రెండు వేలకు మించి విరాళాలు వచ్చిన సమయంలో, ఆ మొత్తాలను బ్యాంకులలో అన్నదాన ఖాతాలో డిపాజిట్ చేస్తారు. రూ.రెండు వేల లోపు విరాళాలు వస్తే నిత్యం చేసే అన్నదాన ఖర్చులో కలిపేస్తారు. ఇప్పటివరకు అన్నదానానికి రూ.10 లక్షలు ఇచ్చిన దాతగా సామర్లకోటకు చెందిన దేవి ఫిషరీస్ యాజమాన్యం మాత్రమే ఉంది.


సామర్లకోటలోని పంచారామ క్షేత్రం

పెరుగుతున్న భక్తులు

అన్నదానం ప్రారంభంలో కేవలం వంద మంది మాత్రమే భోజనాలు చేసే భక్తులు రోజురోజుకూ పెరుగుతున్నారు. సాధారణ రోజుల్లో 300, సోమవారం పర్వదినంలో 600, శరన్నవరాత్రి ఉత్సవాలు, కార్తిక మాసోత్సవాల్లో 1,200 నుంచి 2 వేల మంది భక్తులు అన్నదానంలో భోజనాలు చేస్తున్నారు. మంగళ, బుధవారాల్లో భక్తుల సంఖ్య తక్కువగా ఉంటోంది. అన్నదానంలో సేవలు అందించడానికి అనేక మంది భక్తులు సిద్ధంగా ఉంటున్నారు.

దాతల పేర్లు ఏర్పాటు చేయాలి



సామర్లకోట పంచారామ క్షేత్రంలో ఏర్పాటు చేస్తున్న అన్నదాన ప్రదేశం వద్ద అన్నదానానికి విరాళాలు ఇచ్చే దాతల పేర్లతో శాశ్వత బోర్డు ఏర్పాటు చేయాలి. ఆ విధంగా ఏర్పాటు చేస్తే దాతల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అన్నదానంలో భోజనం ఎంతో రుచికరంగా ఉంటుంది. భవానీ, అయ్యప్ప మాల ధరించిన సమయంలో ఆలయంలో భోజనాలు చేస్తుంటారు. ప్రతి రోజు స్వీట్‌తో పాటు, రెండు కూరలు, సాంబారు వడ్డిస్తున్నారు.

– బందారు ప్రసాద్, భక్తుడు, సామర్లకోట

డిపాజిట్ల వడ్డీతో అన్నదానం



అన్నదానానికి వచ్చిన విరాళాలను బ్యాంకులో డిపాజిట్లు చేసి, దానిపై వచ్చిన వడ్డీతో అన్నదానం నిర్వహిస్తున్నాం. రూ.10 లక్షలు, రూ.ఐదు లక్షలు విరాళమిచ్చిన దాతల పేరున కార్తిక మాసం, మహాశివరాత్రి రోజుల్లో గోత్రనామాలతో పూజలు చేస్తారు. ఇప్పటి వరకు అన్నదానానికి రూ.1.70 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. రూ.25 వేలకు మించి ఇచ్చే దాతల పేర్లతో బోర్డు ఏర్పాటు చేస్తే వారి సంఖ్య పెరుగుతుంది. బోర్డులు ఏర్పాటు చేయడానికి పురావస్తు శాఖ అభ్యంతరాలున్నాయి. ప్రతి రోజు భోజనాల నాణ్యతను పరిశీలిస్తున్నాం.

– భళ్ల నీలకంఠం, ఈఓ, పంచారామ క్షేత్రం, సామర్లకోట

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి: ఆర్థిక లావాదేవీల్లో మోసపోయానన్న మనస్థాపానికి గురైౖ ఓ వ్యక్తి ఆదివారం గడ్డి మందు తాగిన ఉదంతమిది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు, మండలంలోని అమీనాబాదు గ్రామానికి చెందిన కుందల రాజు తాపీ పని చేస్తుంటాడు. గత మూడు నెలలుగా సరిగ్గా పనులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఇలాఉండగా అతను మధ్యవర్తిగా ఉండి ఓ స్నేహితుడికి అప్పు ఇప్పించాడు. అతను తిరిగివ్వకపోవడంతో, అప్పు ఇచ్చినవారి ఒత్తిడి ఎక్కువైంది. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆదివారం ఉదయం గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అస్వస్థతకు గురైన అతడిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం కొత్తపల్లి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై కొత్తపల్లి పోలీసులను సంప్రదించగా, తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

సైకిల్‌పై అయోధ్య యాత్ర


సైకిల్‌పై అయోధ్యకు వెళుతున్న భక్తులు

సామర్లకోట: అయోధ్యకు సైకిల్ యాత్ర చేస్తున్న భక్తులకు వీహెచ్‌పీ నాయకులు స్వాగతం, వీడ్కోలు పలికారు. భక్తులు వాసంశెట్టి బాలు, విత్తనాల హరి, కాళ్ల శ్రీనివాసరావు సైకిల్‌పై కాకినాడ నుంచి అయోధ్యకు బయలుదేరారు. సామర్లకోట వచ్చిన వీరికి నాయకులు ఆదివారం స్వాగతం పలికి అభినందించారు.

ఆస్పత్రిలో షెడ్డుకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: పార్కింగ్ కోసం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రూ.86 వేలతో నిర్మించే రేకుల షెడ్డుకు శనివారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శంకుస్థాపన చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి షెడ్డు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో ఈ షెడ్డు నిర్మించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కంటే బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మిన్నంటిన బేతాళ సంబరం

- ముగిసిన స్వామి ఉత్సవాలు
- దర్శించుకున్న ప్రముఖులు


వేట్లపాలెంలో జరిగిన బేతాళ స్వామి సంబరం


వేట్లపాలెంలో బేతాళ స్వామిని దర్శించుకున్న పారిశ్రామిక వేత్తలు

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెం గ్రామంలో నిర్వహించిన బేతాళ సంబరం అంబరాన్నంటింది. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభాన్ని పురస్కరించుకుని బేతాళ స్వామి ఆలయంలో పది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం భారీఎత్తున బ్యాండ్ మేళం, బాణసంచా కాల్పులతో బేతాళ సంబరం అత్యంత వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పారిశ్రామిక వేత్తలు బొడ్డు వెంకటరమణ చౌదరి, గుణ్ణం చంద్రమౌళి తదితరులు స్వామిని దర్శించుకొని ఉత్సవాన్ని ప్రారంభించారు. బేతాళ సంబరాన్ని తిలకించడానికి అనేక గ్రామాలకు చెందిన వారు అధిక సంఖ్యలో తరలిరావడంతో గ్రామం సందడిగా మారింది. గ్రామానికి చెందిన వారు దూర ప్రాంతాల్లో ఉన్నా తప్పనిసరిగా హాజరై ఉత్సవాల్లో పాల్గొంటారు. ప్రతి ఇంటి నుంచి పిండివంటల ఘుమఘుమలు వచ్చాయి. ఆలయం నుంచి గ్రామ పురవీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. దాంతో ఆయా ఇళ్లలోని భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవం ముగింపును పురస్కరించుకుని బేతాళ స్వామిని గ్రామ శివారుకు తీసుకెళ్లి మట్టిలో పూడ్చి వేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాత్రి భారీఎత్తున బాణసంచా కాల్చారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న సంప్రదాయం

కొత్తపల్లి: ప్రజలకు వినోదాన్ని పంచే సంప్రదాయ కళలు కనుమరుగవుతున్న ఈ రోజుల్లో.. ఇప్పుడు కూడా కొన్ని సంబరాల్లో అవి కనిపిస్తున్నాయి. మండలంలోని కుతుకుడుమిల్లి మార్కెట్ వీధిలో వేంచేసి ఉన్న బేతాళుడి సంబరాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామివారి చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి, కొత్తపల్లి, వాకతిప్ప గ్రామాల్లో ఊరేగించారు. ఈ బేతాళ సంబరంలో భక్తులు చేసిన కర్ర సాము ఎంతగానో ఆకట్టుకుంది. ప్రజలు ఆసక్తిగా తిలకించారు.


కుతుకుడుమిల్లిలో కర్ర సాము చేస్తున్న భక్తులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


జెడ్పీ హైస్కూలు పూర్వ విద్యార్థులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఎస్‌డీఆర్‌ఎస్‌ఏ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010–11 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

రోడ్డు మార్జిన్‌లో తుప్పల తొలగింపు

సాక్షి ఇంపాక్ట్


మినీ జేసీబీతో తుప్పలు తొలగిస్తున్న సిబ్బంది

సామర్లకోట: పట్టణంలోని 23వ వార్డుకు వెళ్లే ప్రధాన రోడ్డులో తుప్పలను తొలగించారు. 'రహదారిద్ర్యం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శనివారం మున్సిపాలిటీ మినీ జేసీబీతో రోడ్డు మార్జిన్‌లో ఉన్న తుప్పలను శుభ్రం చేశారు. రోడ్డు మార్జిన్‌లో తుప్పలు పెరిగిపోవడం, రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆ రోడ్డు బహిరంగ మరుగుదొడ్డిగా మారింది. రోడ్డు సమస్యపై మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య స్పందించి, రోడ్డు మార్జిన్‌లో ఉన్న తుప్పలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. అలాగే 23వ వార్డుకు వెళ్ల ప్రధాన రోడ్డును కూడా నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు


సాగర తీరంలో అమ్మవారిని నిమజ్జనం చేసేందుకు ట్రాక్టర్‌పై తరలిస్తున్న భక్తులు

కొత్తపల్లి: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా మండలంలోని ఉన్న కనకదుర్గాదేవి అమ్మవారిని ఆదివారం ఘనంగా ఊరేగించారు. అమ్మవారి ఉత్సవాలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మశాస్తా ఆలయంలో వేంచేసి ఉన్న కనకదుర్గాదేవి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఊరేగించారు. కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొండెవరం, కోమరగిరి, గొర్స, యండపల్లి తదితర గ్రామాల్లో ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారిని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. గరగ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మండలంలోని కోనపాపపేట నుంచి ఉప్పాడ శివారు సబ్బంపేట సమీపంలో ఉన్న తీర ప్రాంతంలో అమ్మవారి విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు. తీరంలో అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం పుణ్య స్నానాలను ఆచరించారు. భక్తులకు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై వెంకటేష్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పాదగయలో కనుల పండువగా తెప్పోత్సవం

- వైభవంగా ముగిసిన దసరా ఉత్సవాలు
- విజయదుర్గగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి దేవి


దుర్గాడలో భవానీల గ్రామోత్సవం



పాదగయ పుష్కరిణిలో అమ్మవారి తెప్పోత్సవం

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. విజయదశమి సందర్భంగా శని, ఆదివారాల్లో ఆలయాలకు భక్తులు పోటెత్తారు దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో దసరా ఉత్సవాలలో భాగంగా రాజరాజేశ్వరిదేవి విజయదుర్గాదేవిగా భక్తులకు దర్శనమివ్వడంతో, వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పురుహూతికాదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు, స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదగయ పుష్కరిణిలో అమ్మవారి తెప్పోత్సవం కనులపండువగా నిర్వహించిన ఆలయ అర్చకులు శమిపూజ నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గంలో కొత్తపల్లి గొల్లప్రోలు, పిఠాపురం మండలాల పరిధిలో కనకదుర్గ అమ్మవారి ఆలయాలలో దశమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా భక్తులు రాజరాజేశ్వరిదేవి, పురుహూతికా అమ్మవారు, దత్తాత్రేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాలు ముగియడంతో ఆదివారం అన్ని గ్రామాలలోను అమ్మవారి ఊరేగింపులు అత్యంత వైభవంగా నిర్వహించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో లలితాదేవి అమ్మవారు తులసీ వన దుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు.


పాదగయ క్షేత్రంలో విజయదుర్గాదేవిగా..


దుర్గాడలో తులసీ వన దుర్గగా..

ముగిసిన శరన్నవరాత్ర ఉత్సవాలు


రాజరాజేశ్వరి దేవి అవతారంలో కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు


పంచారామ క్షేత్రంలో రాజరాజేశ్వరిగా..


అమ్మవారికి వెండి చీరతో అలంకరణ


భువనేశ్వరి పీఠంలో నిర్వహిస్తున్న పూర్ణాహుతి

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో శరన్నవరాత్ర ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆలయంలోని అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవిని చివరి రోజు రాజరాజేశ్వరిగా అలంకరించారు. భక్తుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో చండీ హోమం జరిగింది. మధ్యాహ్నం జమ్మి చెట్టు వద్ద ఈఓ భళ్ల నీలకంఠం అధ్వర్యంలో ఆలయ శ్రీచక్ర పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అభిషేక పండితులు అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకట రమణ, అంజిబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, విజయ్ శమిపూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం గ్రామోత్సవాన్ని ఈఓ ప్రారంభించారు. ఆలయం నుంచి రైల్వే గేటు మీదుగా గాంధీ చౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి, మఠం సెంటర్, అయోధ్య రామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం జరిగింది. సాయంత్రం అమ్మవారికి వెండి చీర అలంకరణ చేశా. ఆయా కార్యక్రమాల్లో భక్త సంఘ నాయకులు బిక్కిన సాయి, తలుపుల అంజనీకుమార్, గంజి బూరయ్య, ఆలయ సూపర్‌వైజర్ ఈశ్వరరావు సేవలందించారు.

వాడవాడలా దసరా ఉత్సవాలు

పెద్దాపురం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా విజయ దశమిని పురస్కరించుకుని దుర్గమ్మ అమ్మవారి సంబరాలు ఘనంగా జరిపారు. పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో అమ్మవార్ల సంబరాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు, శమీపూజలు, పూర్ణ హారతి నిర్వహించి, అమ్మవార్లను మొక్కుకున్నారు. స్థానిక వర్జుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో శమీ పూజ, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు దంపతులతో కలశస్థాపన, పుష్పాలంకరణ సేవాభాగ్యం నిర్వహించగా, విశేష అర్చన, అలంకరణతో పాటు, పూర్ణాహుతి, సాయంత్రం జమ్మిచెట్టుకు పూజను నిర్వహించారు. పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో విజయ దశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, శమీ పూజ, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపులో భాగంగా విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పంచారామ క్షేత్రంలో నిర్వహిస్తున్న శమీ పూజ